

అఖిల్ 'లెనిన్' రిలీజ్.. షాకింగ్ పోస్ట్‌తో వార్తల్లో నిలిచిన సమంత

దాదాపు మూడేళ్ల నిరీక్షణ తర్వాత 'లెనిన్'తో గట్టి కమ్ బ్యాక్ ఇచ్చాడు అక్కినేని హీరో అఖిల్. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో, భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా జులై 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటి షో నుంచే బ్లాక్ బస్టర్ హిట్ టాక్ సొంతం చేసుకుని దూసుకెళ్తుంది. అంతే కాకుండా ఇందులో అఖిల్ కష్టం స్క్రీన్ పై అడుగడుగునా కనిపిస్తుంది. ఈ పాత్ర కోసం తనను తాను చాలా మార్చుకున్నట్లు తెలుస్తుంది. ఇక అఖిల్ ఇంటెన్స్ అండ్ మాస్ లుక్, యాసకు అయితే ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఇప్పటి వరకు మాస్ అంటే జూనియర్ ఎన్టీఆర్ గుర్తొచ్చేవాడు.. లెనిన్‌తో ఆ లిస్ట్‌లో అఖిల్ కూడా చేరిపోయాడు అంటూ కామెంట్స్‌తో సందడి చేస్తున్నారు అక్కినేని ఫ్యాన్స్. చివర్లో ఎమోషన్ కూడా బలంగా పండటంతో మనోడు హిట్ కొట్టేశాడు అంటూ సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమా సక్సెస్‌పై టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో లెనిన్ ట్రైలర్ షేర్ చేసి.. 'అక్కినేని అఖిల్‌తో పాటు 'లెనిన్' టీమ్ మొత్తానికి ఆల్ ది వేరీ బెస్ట్.. ఇప్పటికే బ్లాక్ బస్టర్ వైబ్ కనిపిస్తుంది' అంటూ చెప్పుకొచ్చింది. ప్రాజెక్ట్ ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్ కావడంతో.. అన్నతో (నాగచైతన్య) విడిపోయినప్పటికీ అఖిల్, సమంత మధ్య స్నేహ బంధం మాత్రం అలాగే ఉందంటూ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు. అలాగే.. 'లెనిన్' సినిమా ప్రమోషన్స్‌లో అఖిల్ కూడా సమంత 'మా ఇంటి బంగారం' సినిమా గురించి మాట్లాడి ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే.

అలాంటి పాత్రలు చేసి డబ్బు సంపాదించాల్సిన అవసరం నాకు లేదు..

నేచురల్ బ్యూటీగా టాలీవుడ్ ఇండస్ట్రీ ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న సాయి పల్లవి.. ప్రస్తుతం తెలుగుతో పాటు బాలీవుడ్‌లో కూడా పలు ప్రాజెక్టులు చేస్తూ బిజీగా ఉంటుంది. ఇదిలా ఉంటే.. తాజా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ హీరోయిన్ కిస్సింగ్ సీన్స్‌పై ఆసక్తికర కామెంట్స్ చేసింది. 'చాలా మంది డైరెక్టర్స్ నేను ముద్దు సన్నివేశాల్లో నటించనని తెలిసినా ఇప్పటికీ అడుగుతూనే ఉంటారు. ఒకవేళ నాకు ఒక భాగస్వామి (బాయ్ ఫ్రెండ్) ఉంటే అప్పుడు యాక్టింగ్ అయినా మరేది అయినా వేరే ఒకరిని ముద్దు పెట్టుకోవడం కరెక్ట్ కాదు కదా. ఒక మంచి జీవితాన్ని గడపడానికి స్త్రీకి లేదా పురుషుడికి కావాల్సింది సంతోషకరమైన కుటుంబం. ఒక కారు, ఒక ఇల్లు మాత్రమే. ఇప్పటికే అవన్నీ నా దగ్గర ఉన్నాయి. కేవలం మరో కారు కొనడం కోసం నేను వేరొకరిని ముద్దు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. నాకున్న దానితో నేను సంతోషంగా ఉన్నాను. నటన కోసం నన్ను సినిమాలో తీసుకోవాలనుకుంటే తీసుకోండి, కానీ సన్నిహిత సన్నివేశాల కోసం అయితే వేరే వారిని ఎంపిక చేసుకోండి. నాకు అందులో ఎలాంటి అభ్యంతరం లేదు' అంటూ చెప్పుకొచ్చింది. ప్రాజెక్ట్ సాయి పల్లవి కామెంట్స్ వైరల్ అవుతుండగా.. 'డబ్బు కంటే విలువలకు ప్రాధాన్యతనిచ్చే వారిని చూడటం చాలా అరుదు' అంటూ ప్రశంసిస్తున్నారు అభిమానులు.

మనకై.. మనమై జీవిద్దాం..

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'టాక్సిక్' మీదనే. యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యుమా ఖురేషీ, తారా సుతారియా కథానాయికలు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఈ చిత్రంలోని 'తబాహీ..' అనే గీతాన్ని విడుదల చేసింది చిత్రబృందం. "లోకం సంకెళ్లు తెంచేద్దాం.. కాలం పరదాలు కాల్చేద్దాం. మనకై మనమై జీవిద్దాం.." అంటూ సాగుతోందీ గీతం. రామజోగయ్య శాస్త్రి దీనికి సాహిత్యమందించారు. వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న థియేటర్లలోకి రానుంది.

ప్రేక్షకులు నన్ను మర్చిపోయారేమోనని భయపడ్డా: విష్ణు విశాల్

'గట్టా కుస్తీ 2' సినిమాతో తమిళ హీరో విష్ణు విశాల్ తన కెరీర్‌లోనే అతిపెద్ద సక్సెస్‌ను అందుకున్నారు. చెన్నైలో జరిగిన మూవీ సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు."భిన్నమైన కథలను ఎంచుకునే నాకు ప్రేక్షకులు ఎప్పుడూ అండగా నిలిచారు. వారికి నా ధన్యవాదాలు. 'గట్టా కుస్తీ పార్ట్ -1' తర్వాత రెండు మూడేళ్లుగా నేను సరైన సినిమా చేయలేదు. దాంతో ప్రేక్షకులు నన్ను మర్చిపోయారేమో అని చాలా భయపడ్డాను. కానీ, ఇప్పుడు 'గట్టా కుస్తీ 2' సక్సెస్‌తో మళ్లీ నమ్మకం వచ్చింది. నాపై వారి ప్రేమ ఏమాత్రం తగ్గలేదని అర్థమైంది. ఇషారి కె.గణేశ్ నాపై ఎంతో నమ్మకం ఉంచారు. సినిమా చిత్రీకరణ సమయంలో నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. నేను ఈ విజయాన్ని అభిమానులకే అంకితం చేస్తున్నాను" అని విశాల్ చెప్పారు. కాగా, ఈ సినిమా జులై 3న విడుదలైంది. భారీ విజయం సాధించిన సందర్భంగా చిత్ర నిర్మాత ఇషారి కె.గణేశ్.. విష్ణు విశాల్‌కు 'బీఎండబ్ల్యూ 3 సిరీస్' కారును బహుమతిగా ఇచ్చారు. అలాగే, దర్శకుడు చెల్ల అయ్యావుకు బంగారు గొలుసు.. మిగతా చిత్ర బృందానికి, సాంకేతిక నిపుణులకు వెండి నాణేలను కానుకగా ఇచ్చి సత్కరించారు. ఈ చిత్రం త్వరలోనే బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల మార్కును చేరుకుంటుందని విశాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మూవీలో ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. యోగిబాబు, కరుణాస్, కాళీ వెంకట్ తదితరులు కీలకపాత్రలు పోషించారు.

షూటింగ్‌లో గాయాలు.. చిత్రబృందం ఎంతో సపోర్ట్ చేసింది: రాశీఖన్నా

బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ , నటి రాశీ ఖన్నా , విద్యాబాలన్ ప్రధాన పాత్రల్లో, దర్శకుడు అనీస్ బజ్మీ ఓ కామెడీ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్‌లో యాక్షన్ సీన్లు చేస్తుండగా గాయాలు అయ్యాయని, చిత్రబృందం, కుటుంబం ఎంతో సపోర్ట్ చేసిందంటూ రాశీ ఖన్నా తెలిపారు. "ఈ మూవీ చిత్రీకరణ సమయంలో అనారోగ్యానికి గురయ్యాను. యాక్షన్ సన్నివేశాలు చేస్తుండగా గాయాలు అయ్యాయి. అయినా షూటింగ్ ఆపలేదు. నేను చేసిన షెడ్యూల్స్‌లో ఇది కష్టమైనది. అలాంటి రోజుల్లో నా కుటుంబం, తోటి నటులు, చిత్రబృందం ఇచ్చిన ధైర్యంతో షూటింగ్ చేయగలిగా. కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా ఉండిపోయే జ్ఞాపకాలు ఇవే" అని రాశీ ఖన్నా ఇన్‌స్టాలో రాసుకొచ్చారు.'భూల్ భూలయ్యా' తర్వాత అక్షయ్ - విద్యా కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. సుదేశ్ లెహ్రి, జాకీర్ హుస్సేన్, విజయ్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీ డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.

పూరి జగన్నాథ్ సినిమా ఫ్లాప్ అయినా నిర్మాతలు నష్టపోరు..

తెలుగులో మంచి గుర్తింపు సంపాదించుకున్న మహిళా దర్శకుల్లో నందిని రెడ్డి ఒకరు. తాజాగా ఆమె దర్శకత్వం వహించిన 'మా ఇంటి బంగారం' చిత్రంలో సమంత ప్రధాన పాత్ర పోషించింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నందిని రెడ్డి, దర్శకుడు పూరి జగన్నాథ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. నేను ఇప్పటివరకు తెరకెక్కించిన సినిమాల్లో కొన్ని హిట్ అయ్యాయి, మరికొన్ని ఫ్లాప్ అయ్యాయి. అయినప్పటికీ నాతో సినిమా చేసిన ఏ నిర్మాత కూడా నష్టపోలేదు. అందుకు ప్రధాన కారణం సినిమాను తక్కువ రోజుల్లో, అనుకున్న బడ్జెట్‌లో పూర్తి చేయడమే. నేను దర్శకురాలిగా కెరీర్ ప్రారంభించే ముందు ఒకరు నాకు పూరి జగన్నాథ్ గారి గురించి చెప్పారు. ఆయన చాలా వేగంగా సినిమాలను పూర్తి చేస్తారని, అలాగే ముందుగా నిర్ణయించిన బడ్జెట్‌లోనే చిత్రాన్ని తెరకెక్కిస్తారని అన్నారు. అందుకే ఆయన సినిమాలు ఫ్లాప్ అయినా నిర్మాతలకు పెద్దగా నష్టాలు రావని చెప్పారు. నేను కూడా అదే విధానాన్ని అనుసరిస్తాను. సినిమాకు అవసరమైన చోట నిర్మాతతో ఖర్చు పెట్టిస్తాను. కానీ అనవసర ఖర్చులకు మాత్రం ఎప్పుడూ అవకాశం ఇవ్వను. సినిమాలను వేగంగా, అనుకున్న బడ్జెట్‌లో పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను. అందుకే నా సినిమాల్లో కొన్ని ఆశించిన ఫలితాన్ని అందుకోకపోయినా నిర్మాతలకు పెద్దగా నష్టాలు రావడం లేదని నందిని రెడ్డి తెలిపారు.

ఇడుపు కాయితంలో 'చంద్రవ్వ'..

ప్రియదర్శి, జానపద గాయని నాగదుర్గ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇడుపు కాయితం'. వంశీరెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సుకుమార్ సమర్పణలో బన్నివాసు నిర్మిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ మూవీ ఇటీవల పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా స్టార్ట్ అయ్యి.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే.. ఈ మూవీలో యాంకర్‌గా, తెలంగాణ యాస, చమత్కారమైన మాటలతో అందరిని ఆకట్టుకున్న చంద్రవ్వ అలియాస్ దేవి సుజాత ఇందులో నటిస్తున్నట్లు తెలిపారు. తాజాగా చంద్రవ్వ పుట్టిన రోజు కావడంతో ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ పోస్టర్ షేర్ చేశారు. 'అత్యంత ప్రతిభావంతురాలైన నటి చంద్రవ్వ (అలియాస్ దేవి సుజాత)కు ఇడుపు కాయితం బృందం తరపున పుట్టినరోజు శుభాకాంక్షలు.. 1కే చిత్రంలో ఆమె అద్భుతమైన నటనను వీక్షించడానికి సిద్ధంగా ఉండండి' అంటూ తెలిపారు.

ఫిఫా ప్రపంచ కప్.. ఎంబాపె అరుదైన రికార్డు

విశ్వంభర, స్పోర్ట్స్: ఫ్రాన్స్ ఫుట్‌బాల్ స్టార్ క్లియాన్ ఎంబాపె అదరగొట్టేస్తున్నాడు. ఫిఫా ప్రపంచ కప్‌లో మొరాకోతో జరిగిన క్వార్టర్స్‌లో ఫ్రాన్స్ విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఎంబాపె 60వ నిమిషంలో, ఓస్మనె డెంబెలె 66వ నిమిషంలో గోల్స్ సాధించారు. దీంతో ఆ జట్టు 2-0 తేడాతో మొరాకోను ఓడించింది. దీంతో ఎంబాపె ఈ ప్రపంచ కప్‌లో అత్యధిక గోల్స్ సాధించిన మెస్సి (8)తో కలిసి సమంగా నిలిచాడు. గోల్డెన్ బూట్ రేసులో ఇగ్లింగ్ హాలాండ్ (7) కూడా ఉన్నాడు. ఈ క్రమంలో ప్రపంచ కప్ చరిత్రలో 27 ఏళ్ల ఎంబాపె అరుదైన ఘనత సాధించాడు.ఫిఫా ప్రపంచ కప్‌లో 20 మ్యాచులు ఆడిన ఎంబాపె 20 గోల్స్ సాధించాడు. 30 ఏళ్ల వయసు లోపే ఈ ఘనత సాధించిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. మెస్సి ఇప్పటి వరకు 21 గోల్స్ చేసి అగ్రస్థానంలో ఉన్నాడు. 39 ఏళ్ల వయసులో ఈ ఘనత సాధించాడు.రెండు ప్రపంచ కప్‌ల్లో 10 లేదా అంతకంటే ఎక్కువ గోల్స్‌లో భాగస్వామ్యం అయిన ఏకైక ప్లేయర్ ఎంబాపె. 2022 వరల్డ్ కప్‌తోపాటు ప్రస్తుత ప్రపంచ కప్‌లోనూ అతడి జోరు కొనసాగుతోంది.

యంగెస్ట్ మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన అరుదైన ఘనత

విశ్వంభర, స్పోర్ట్స్: భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనతను సాధించింది. అంతర్జాతీయంగా అతి పిన్న వయస్సులో 300 మ్యాచులు ఆడిన బ్యాటర్‌గా నిలిచింది. 29ఏళ్ల స్మృతి ఇప్పటివరకు తొమ్మిది టెస్టులు, 120 వన్డేలు, 171 టీ20 మ్యాచులు ఆడింది. మొత్తం 10వేలకుపైగా పరుగులు చేసింది. ఇందులో 17 సెంచరీలు, 74 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. భారత్ తరపున 2013లో స్మృతి మంధాన అరంగేట్రం చేసింది.

విఫలమైన షఫాలీ.. మంధాన హాఫ్ సెంచరీ

ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో భారత మహిళ జట్టు టెస్టు మ్యాచ్ ఆడుతోంది. ఇప్పటికే ఓపెనర్ స్మృతి మంధాన హాఫ్ సెంచరీ సాధించింది. అయితే, ఓపెనర్ షఫాలీ వర్మ (0) డకౌట్‌గా పెవిలియన్‌కు చేరింది. అనంతరం వచ్చిన యస్తికా భాటియా (12) ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేదు. సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన జెమీమా రోడ్రిగ్స్ (35) దూకుడుగా ఆడింది.

టెస్టుల్లో శ్రీచరణి ఆరంగేట్రం

భారత మహిళల జట్టు ఇంగ్లండ్‌లోని ప్రఖ్యాత లార్డ్స్ వేదికగా ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడుతోంది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు తరపున తెలుగుతేజం శ్రీ చరణ్ టెస్ట్ సిరీస్‌తో అరంగేట్రం చేసింది. ఇటీవల జరిగిన మహిళల టీ 20 ప్రపంచకప్‌లో సెమీస్ కు కూడా చేరకుండానే టీమిండియా వెనుదిరిగిన సంగతి తెలిసిందే. దీనితో ఎలాగైనా ఈ ఇంగ్లండ్ టెస్ట్ గెలవాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో శ్రీ చరణితో పాటు యస్తిక బాటియా కూడా తుది జట్టులోకి పునరాగమనం చేసింది. ఇంగ్లండ్ జట్టు నుండి కూడా ఎలీస్ కాప్సీ, మాడీ డివిలియర్స్ డెబ్యూ చేశారు. మహిళల ఈ టెస్ట్ మ్యాచ్ నాలుగు రోజులు జరగనుంది. భారత్- ఇంగ్లాండ్ మహిళా జట్ల మధ్య ఇప్పటివరకూ 15 టెస్ట్ మ్యాచ్‌లు జరగగా.. భారత్ మూడు గెలిచింది. ఇంగ్లండ్ ఒక్కటే గెలిచిందే. ఇక మిగిలిన 11 మ్యాచ్‌లూ డ్రా గా ముగిశాయి. భారత్ నుండి తుది జట్టులో స్మృతి మంధాన, షఫాలీ వర్మ, యస్తిక భాటియా, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ రాణా, పూజా వస్త్రాకర్, రేణుకా సింగ్, రాధా యాదవ్ ఆడుతున్నారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టు భారత్‌కు మొదట ఫీల్డింగ్ అప్పగించి, తాము బ్యాటింగ్ ఎంచుకుంది.

చెలరేగిన అభిరథ్.. ఫైనల్‌కు దూసుకెళ్లిన 'ఈ' ఛాంపియన్స్

విశ్వంభర, స్పోర్ట్స్: టీజీ20లీగ్‌లో హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. కరీంనగర్ డైమండ్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో విజయ దుందుభి మోగించింది. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 158 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (82; 49 బంతుల్లో 7ఐ4, 5ఐ6) చెలరేగాడు. వికాస్‌రెడ్డి (45; 31 బంతుల్లో 3ఐ4, 3ఐ6) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణిత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. సింహా (38),శుభం శర్మ (31),సాత్విక్ రెడ్డి (28), రాహుల్ రాధేశ్ (28) రాణించారు. ఈ ఛాంపియన్స్ బౌలర్లలో అజయ్ దేవ్ గౌడ్, షణ్ముఖ అశ్విన్, ప్రణవ్ వర్మ తలో 2 వికెట్లు పడగొట్టగా.. అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీశాడు.

అభిరథ్ విజృంభణ..

లక్ష్య ఛేదనకు దిగిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ ప్రారంభం నుంచే కసితీరా ఆడింది. వరుస ఫోర్లు, సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించింది. ఓపెనర్లు అభిరథ్, వికాస్ పోటాపోటీగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కరీంనగర్ బౌలర్లకు చుక్కలు చూపించారు. బంతి పడటమే తరువాయి.. బౌండరీ అవతలకే అన్నట్లుగా ఆడారు. అతి ప్రమాదకరంగా మారిన ఈ జోడీని శుభం శర్మ విడగొట్టాడు.జట్టు స్కోరు 124 పరుగుల వద్ద 12.3వ బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించిన వికాస్‌రెడ్డి.. బౌండరీ లైన్ వద్ద సింహా చేతికి చిక్కి పెవిలియన్‌కు చేరాడు.

అక్కడికి స్వల్ప వ్యవధిలోనే అఖిల్ వేసిన 15వ ఓవర్ చివరి బంతికి అభిరథ్.. సిక్స్ కొట్టే ప్రయత్నంలో రాథోడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివర్లో వచ్చిన వైష్ణవ్ రెడ్డి (25బి), యశ్వీర్ (4బి) కలిసి టార్గెట్‌ను పూర్తి చేశారు. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం జట్టుతో హైదరాబాద్ ఈ -ఛాంపియన్స్ తలపడనుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9411222429 | Email: vishwambhara.daily@gmail.com